హతవిధీ.. దొరగొంది రహదారి తీరిది!

బురదలో గిరిజనుల అవస్థలు

గూడెంకొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ మారుమూల దొరగొంది గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల వర్షాలకు అత్యంత దయనీయంగా మారింది. పంచాయతీ కేంద్రం గుమ్మిరేవులకు ఈ గ్రామం ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇటీవల ఈ గ్రామానికి రహదారి మంజూరైంది. గుత్తేదారు పనులు అసంపూర్తిగా వదిలేశారు. ఇటీవల విడవకుండా కురుస్తున్న వర్షాలకు ఈమార్గం పూర్తిగా బురదమయంగా మారింది. అడుగు తీసి అడుగువేయలేని పరిస్థితి ఎదురవుతోంది. ద్విచక్రవాహనాలు ఈ బురద దారిలో కూరుకుపోతున్నాయని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని త్వరగా రహదారి నిర్మాణం పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. – సీలేరు, న్యూస్‌టుడే

ఉద్యాన వైభోగం

జిల్లాలో పెరుగుతున్న పంటల సాగు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం

చింతపల్లి, న్యూస్‌టుడే

ఒకప్పుడు.. ఈ రోజు ఏదోలా గడిచింది. రేపటి మాటేంటి? అనే ప్రశ్న గిరిజన రైతుల్లో ఉదయించేది కాదు. అటవీ ఉత్పత్తులు సమృద్ధిగా లభించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి ఏటా పంటలు దెబ్బతింటున్నాయి. బతుకుదెరువు కోసం గిరిజనులు ఇతర జిల్లాలకు వలసవెళ్తున్నారు. చేపలు, రొయ్యల చెరువులు, కోళ్ల ఫారాల్లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత రెండేళ్లలో మన్యంలోనూ అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. వ్యవసాయ పంటలకు దీటుగా ఉద్యాన పంటల సాగు చేస్తున్నారు. రాజ్‌మా, మొక్కజొన్న, పసుపు, అల్లం, కాఫీ, మిరియాల తోపాటు స్ట్రాబెరీ, లిచీ, డ్రాగన్, అవకాడో, ఫ్యాషన్ ఫ్రూట్ పండిస్తున్నారు.

కాఫీశుద్ధి కర్మాగారం వద్ద ఉపాధి పనుల్లో గిరిమహిళలు

సంఘటితంగా సాగుతూ..

గతంలో విత్తు మొదలు పంట విక్రయం వరకు అన్ని పనులను ఎవరికి వారు విడివిడిగా చేపట్టేవారు. ఇప్పుడు ఎవరి పొలాల్లో వారు సాగు చేస్తున్నా.. దిగుబడులను విక్రయించేందుకు సంఘటితం అవుతున్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్)గా ఏర్పడుతున్నారు. ఈ దిశగా వారిని వ్యవసాయ, ఉద్యాన శాఖలతోపాటు ఐటీడీఏ, పలు స్వచ్ఛంద సంస్థలు ప్రోత్సహిస్తున్నాయి.

★ చింతపల్లి మండలంలో ఐటీడీఏ సహకారంతో గిరిజన రైతులు కాఫీ ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడ్డారు. ఈ సంఘం ఆధ్వర్యంలో ప్రస్తుతం ఎకో కాఫీ శుద్ధి కర్మాగారం నడుస్తోంది. కాఫీ గింజల సేకరణ నుంచి ప్రాసెసింగ్, ఎగుమతులకు వీలుగా సిద్ధం చేసే పనులను అధికంగా మహిళలే చేస్తున్నారు. ఏటా నాలుగు నెలల పాటు సుమారు వంద మందికి పైగా మహిళలకు స్థానికంగానే ఉపాధి లభిస్తోంది.

★ లంబసింగి, తాజంగి పరిసర ప్రాంతాల్లో పసుపు సాగుచేసే రైతులు అధికంగా ఉన్నారు. గిరిజన వికాస్ సంస్థ తాజంగి కేంద్రంగా ఆంధ్రా కశ్మీర్ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసింది. సుమారు వెయ్యి మంది రైతులు ఈ సంఘంలో సభ్యులుగా ఉన్నారు. పండించిన పసుపు నంతటినీ శుద్ధిచేయడం, పాలిషింగ్, గ్రేడింగ్ చేసి ఎగుమతులకు సిద్ధం చేసే పనులన్నీ మహిళలే చేస్తున్నారు.

★ చింతపల్లి మండలంలో స్ట్రాబెరీ తోటల విస్తీర్ణం బాగా పెరిగింది. సిరిపురం, రాజుపాకలు, లంబసింగి, లబ్బంగి ప్రాంతాల్లో సుమారు వందల ఎకరాల్లో స్ట్రాబెరీ తోటలున్నాయి. అవకాడో, లిచీ, డ్రాగన్ తోటలనూ సాగు చేస్తున్నారు.

పసుపు శుద్ధీకరణ పనుల్లో స్థానికులు

ప్రభుత్వం చేయూత

రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. వ్యవసాయ, ఉద్యాన పంటలను పండించే రైతులంతా సంఘటితమై సంఘంగా ఏర్పడితే రాయితీపై యంత్రాలను సమకూరుస్తాం. కలెక్టర్ ఆదేశాలతో మండలానికి రెండు రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయిస్తున్నాం. – బాలకర్ణ, జిల్లా ఉద్యాన అధికారి

ఏరు దాటితే ఊరు.. చినుకు పడితే వెళ్లలేరు!

కొయ్యూరు మండలం యు.చీడిపాలెం పంచాయతీ గొట్టెలపాడు సమీపంలో బూడిద గెడ్డపై వంతెన నిర్మాణం కలగానే మిగులుతోంది. ప్రతి ఎన్నికల్లో వంతెన నిర్మిస్తామంటూ రాజకీయ పార్టీల నేతలు హామీ ఇవ్వడం తప్ప అమలు చేసిన దాఖలాల్లేవు. యు.చీడిపాలెం పంచాయతీ కేంద్రంతోపాటు 15 గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం. దశాబ్దాల తరబడి వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నా ఫలితం లేకపోతోందని ఆ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ కొండవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుంటుంది. ఈ క్రమంలో ఆయా గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఏటా వర్షాకాలంలో గిరిజనులు రాకపోకలకు నానాపాట్లు పడుతుంటారు. అత్యవసర పనులకు ప్రాణాలకు తెగించి వాగు దాటుతుంటారు. రెండేళ్ల క్రితం ఇక్కడ రెండు బైక్‌లు కొట్టుకుపోయాయి. నిత్యావసర సరకులు పట్టుకెళ్లిన లారీ అప్పట్లో వాగులో చిక్కుకుపోవడంతో ట్రాక్టర్ల సాయంతో బయటకు లాగారు. గత ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి రూ.రెండు కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారులు పలుమార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి వంతెన నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని యు.చీడిపాలెం, గొట్టెలపాడు, ఉల్లిగుంట, ఎర్రగొండ, మర్రిపాకలు తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – కొయ్యూరు, న్యూస్‌టుడే

పీఎం జన్‌మన్ పనులపై దృష్టి

పాడేరు, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ (పీఎం-జన్‌మన్) పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ నిశాంతి ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం గృహనిర్మాణ సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 28,691 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 25,388 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. 3,303 గృహ నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. త్వరితగతిన పనులు ప్రారంభించాలన్నారు. నిర్మాణ పనులు ప్రారంభించేందుకు లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బిల్లుల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని పేర్కొన్నారు. పీఎం జన్‌మన్ పథకం ద్వారా బలహీన గిరిజన తెగల కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గృహ నిర్మాణ సంస్థ అధికారులు బాబూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈసారి శభాష్ అనిపించుకుందాం

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాకు ముఖ్యమంత్రి మరోసారి వచ్చినప్పుడు అధికార యంత్రాంగం తమ పనితీరుతో శభాష్ అనిపించుకునే స్థాయిలో ఫలితాలు సాధించాలని కలెక్టర్ నిశాంతి పేర్కొన్నారు. గతనెల 28న అరకులోయ మండలం గన్నెల గ్రామంలో నిర్వహించిన ప్రజావేదికలో అధికారుల పనితీరు ఆశించిన స్థాయిలో లేదని ముఖ్యమంత్రి పేర్కొన్న నేపథ్యంలో ఆయా అంశాలపై కలెక్టర్ సోమవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాస్థాయి అధికారులు తమ పనితీరును మరింత మెరుగుపరిచేందుకు పలు సూచనలు చేశారు. ఎలాంటి సాకులు చెప్పకుండా ప్రతిఒక్కరూ తమ పూర్తి సామర్థ్యంతో పని చేయాలని, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. గ్రామసభలు నిర్వహించి.. ప్రభుత్వ, సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సంయుక్త కలెక్టర్ శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్యవర్మ, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వరరావు, ఆర్‌డీఓ భుజంగరావు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంతి, చిత్రంలో సంయుక్త కలెక్టర్ శ్రీపూజ, ఐటీడీఏ పీఓ ఆదిత్యవర్మ

'సర్' పెండింగ్ కేసులు పరిష్కరించండి

పాడేరు, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న విచారణలు, నోటీసుల జారీని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంతి రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. పాడేరులో సోమవారం సర్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అధిక కేసులు పెండింగ్‌లో ఉన్న అరకులోయ మండలంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సంయుక్త కలెక్టర్ శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మ, ఆర్‌డీవో భుజంగరావు, ఆర్‌డీవో లోకేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలకు అండగా... ఈ బాక్స్ ఉందిగా

అనంతగిరి, న్యూస్‌టుడే: ఆడపిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లిన దగ్గర నుంచి బస్‌స్టేషన్లు, ఆటోలు, ఆఫీసుల్లో ఎన్నో వేధింపులను ఎదుర్కొంటున్నారు. అటువంటివి బయటికి చెప్పుకోలేక.. ఫిర్యాదులు చేయలేక మౌనంగా భరిస్తారు.. దేశవ్యాప్తంగా చిన్నారుల నుంచి మహిళల వరకు వయసుతో సంబంధం లేకుండా వేధింపులకు గురవుతున్నారు. అటువంటి వాటిని ఇంట్లో చెప్పలేక లోలోన భయపడుతున్న ఆడబిడ్డలకు అండగా నేనున్నానంటూ పోక్సో ఈ బాక్స్ అందుబాటులోకి వచ్చింది. పోలీసుల వద్దకు వెళ్లకుండా వివరాలు గోప్యంగా ఉంచి బాధ్యులను శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. జాతీయ బాలల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో ఈ యాప్ పనిచేసే విధంగా రూపకల్పన చేసింది.

నేరాలు.. ఫిర్యాదులు

★ ఆడపిల్లలను ఆటస్థలం, పాఠశాల, ట్యూషన్, స్కూల్ బస్, వ్యాన్ ఎక్కడైనా సరే శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేసినా.. ఫోన్ లేదా సామాజిక మాధ్యమాల ద్వారా బ్లాక్‌మెయిల్ చేసినా.. కుటుంబ సభ్యులు, బంధువులు ఇతరులు ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా ఫిర్యాదు చేయవచ్చు. ★ ఆన్‌లైన్‌లో ఫొటోలను తప్పుగా మార్చి ప్రచారం చేయటం వంటి నేరాలపైనా ఫిర్యాదు చేయవచ్చు.

డౌన్‌లోడ్ ఇలా...

గూగుల్ ప్లేస్టోర్ నుంచి పోక్సో ఈ బాక్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేయగానే పోక్సో ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అందులో ఆటస్థలం, పాఠశాల, కుటుంబ సభ్యులు, ఇంటర్నెట్ తదితర ఆరు ప్రదేశాలను చూపిస్తూ చిత్రాలు ఉంటాయి. మీకు జరిగిన సంఘటనకు సంబంధించిన చిత్రంపై క్లిక్ చేయాలి. తర్వాత పేరు, ఫోన్ నంబరు, మెయిల్ ఐడీతో పాటు జరిగిన సంఘటనను క్లుప్తంగా నమోదు చేయాలి.
★ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులను ప్రత్యేక బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తాయి. ఫిర్యాదు, ఘటనకు సంబంధించిన వివరాలను తక్షణమే రాష్ట్ర, జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారులకు పంపిస్తారు. అనంతరం ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి కేసులు నమోదు చేస్తారు.

సీఎం సభకు వేదిక ముస్తాబు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఈనెల 2న పి.ఎల్.పురం వద్ద జరిగే సీఎం బహిరంగ సభకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. మార్కెట్ యార్డు పక్కన జాతీయ రహదారిని ఆనుకుని సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో సభ నిర్వహించనున్నారు. ఇక్కడే హెలిప్యాడ్ నిర్మించారు. దాదాపు 30 వేల మందికి పైగా ఉండే విధంగా ప్రాంగణంలో సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతోపాటు వేదిక వద్దకు చేరుకునేందుకు, వాహనాల పార్కింగుకు ప్రత్యేకంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ రోజూ అధికారులతో కలిసి సభావేదిక, పోలవరం ఎడమ కాలువ పనులను స్వయంగా పరిశీలిస్తున్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఉత్తరాంధ్ర జిల్లాకు ముఖద్వారంలో నిర్వహించనున్న సభను విజయవంతం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

చంద్రబాబు పర్యటన షెడ్యూలు ఖరారు

అనకాపల్లి: సీఎం హెలికాప్టర్‌లో బుధవారం మధ్యాహ్నం 2.20 గంటలకు పి.ఎల్. పురంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడే ప్రజాప్రతినిధుల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం 2.45 గంటలకు జలహారతి ఇచ్చి గోదావరి జలాలను విడుదల చేస్తారు. 3.30 గంటలకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు తిరుగు పయనమవుతారు.

వెల్డింగ్ టెక్నాలజీ కోర్సులో ఉచిత శిక్షణ

విశాఖపట్నం, న్యూస్‌టుడే: యువతలో సాంకేతిక నైపుణ్యాలు పెంచడంతోపాటు దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి వెల్డింగ్ టెక్నాలజీ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి నీలం గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద మూడు నెలలపాటు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. పదో తరగతి ఆపైన చదివి, 18-40ఏళ్ల లోపు వయసున్న వారు అర్హులన్నారు. వివరాలకు 85558 68681 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దేశానికే ఆదర్శంగా విశాఖ అభివృద్ధి

★ ఆ స్థాయిలో అందరం కలిసి పని చేద్దాం ★ మంత్రి నారా లోకేశ్

ఈనాడు– విశాఖపట్నం, న్యూస్‌టుడే, ఆనందపురం: 'రాష్ట్ర విభజన తర్వాత విశాఖకు ఎంతో చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. విశాఖ ఎకనమిక్ రీజియన్ దేశంలోనే తొలి వన్ ట్రిలియన్ డాలర్ల ఎకనమిక్ రీజియన్‌గా మారుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో విశాఖ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది' అని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆయన సోమవారం నగరంలో మూడు కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఏఐజీ ఆధ్వర్యంలోని వెయ్యి పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ, మాజీ ముఖ్యమంత్రి రోశయ్య కాంస్య విగ్రహావిష్కరణ, ప్రేమ ఉదయం, ఏజ్‌కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. 'విశాఖ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఏఐజీ ఆసుపత్రిని రెండేళ్లలో 650 పడకలతో అందుబాటులోకి తీసుకొస్తాం. హైదరాబాద్‌ను చంద్రబాబు అభివృద్ధి చేసిన విధంగా విశాఖ అభివృద్ధిలో కూడా ఒక కొత్త బెంచ్ మార్క్ సృష్టించబోతున్నాం. విశాఖ నంబర్ వన్‌గా ఉండాలి. దేశంలోని మోడల్ సిటీల్లో ఒకటిగా విశాఖను అభివృద్ధి చేస్తాం' అని లోకేశ్ స్పష్టం చేశారు.

ఏజ్‌కేర్ ఫౌండేషన్ పాలియేటివ్ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి లోకేశ్

ఒక వ్యక్తి దాతృత్వంతో ఎందరికో ఆశ్రయం : 'దివంగత పద్మశ్రీ డాక్టర్ ఎస్‌వీ ఆదినారాయణరావు సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయం. ఆయన చేసిన దానం నేడు వేల మందికి ఉపయోగపడే మహా వృక్షంగా మారింది. ఆదినారాయణరావు సమాజ సేవ కోసం ఆరు ఎకరాలు కేటాయించడం అభినందనీయం. సేవా కార్యక్రమాలకు విరాళాలు అందించిన దాతలందరూ సమాజానికి మార్గదర్శకులు. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయడం ప్రశంసనీయం. పాలియేటివ్ కేర్ సెంటర్ రాష్ట్రంలోనే ప్రత్యేకమైందిగా నిలుస్తుంది. సివిల్ సొసైటీ, ప్రభుత్వం, అధికారులు కలిసి పనిచేస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో తెలిపేందుకు ఈ ప్రాంగణం చక్కటి ఉదాహరణ. యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి' అని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.

హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్‌కు భూమిపూజ

విలువతో కూడిన విద్యే కీలకం : 'తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేసే పరిస్థితులు బాధాకరం. ఇటువంటి రోజుల్లో ఏజ్‌కేర్ ఫౌండేషన్ ద్వారా వృద్ధులకు అత్యాధునిక కేర్ సెంటర్ నిర్మించడం అభినందనీయం. అంగన్‌వాడీ స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విలువలు, నైతికతతో కూడిన విద్య అందించాల్సిన బాధ్యత నాపై ఉంది. చాగంటి కోటేశ్వరరావుకు కేబినెట్ ర్యాంక్‌తో అడ్వైజర్ బాధ్యతలు అప్పగించినా.. ప్రభుత్వం నుంచి ఆయన ఎలాంటి సదుపాయాలు తీసుకోలేదు. పిల్లలకు విలువలు నేర్పే పుస్తకాలను రూపొందించి వాటిని ప్రభుత్వ పాఠశాలల్లో అందించాలని మాత్రమే ఆయన కోరారు. అమ్మకి చెప్పలేని పని ఏదీ చేయెద్దు అనే చాగంటి మాట ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా ఉండాలి. వృద్ధులు సమాజంలో గౌరవంగా జీవించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన. ఈ లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4 వేలు పింఛను, దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ అందిస్తుంది' అని లోకేశ్ పేర్కొన్నారు.

డేటా సెంటర్ల విషయంలో అపోహలొద్దు: 'ప్రజలకు, ప్రకృతి ప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమం చేపట్టదు. అభివృద్ధి వేగంగా జరుగుతున్నప్పుడు వచ్చే అపోహలను తొలగించి ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. డేటా సెంటర్ల విషయంలో కూడా కొన్ని అపోహలున్నాయి. నేను వ్యక్తిగతంగా ఇంటెల్ డేటా సెంటర్‌ను పరిశీలించాను. విశాఖలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ల విషయంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తాం. నీటి వినియోగాన్ని తగ్గించే ఎయిర్ కూలింగ్ వంటి సాంకేతికతలకు ప్రాధాన్యం ఇస్తాం' అని లోకేశ్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ శ్రీభరత్, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, ప్రీపోలియో సర్జికల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఛైర్మన్ రొక్కమ్ శశి ప్రభ, హరే కృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షులు నిష్కించిన భక్త దాస తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్న, గంటాతో నారా లోకేశ్

గంభీరం వద్ద నిర్వహించిన పలు కార్యక్రమాల్లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ముందుగా హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆలయాన్ని సందర్శించి ఆలయ కిచెన్ ప్రారంభించారు. అక్కడే హరేకృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనాన్ని ప్రారంభించారు.

సింహగిరిపై వరలక్ష్మీ వ్రతాలు 11న

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 11న సింహగిరిపై ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఈవో జల్లేపల్లి వెంకటరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఆలయ ఉత్తర గోపురం ఎదురుగా వార్షిక కల్యాణోత్సవ వేదిక వద్ద వ్రతాలు జరుగుతాయని పేర్కొన్నారు. వీటిలో పాల్గొనే గృహిణులకు దేవస్థానం ఉచితంగా పూజా సామగ్రి, కొండ దిగువకు, పైకి ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తుందని తెలిపారు. పాల్గొనాలనుకునే మహిళలు ఈ నెల 5 నుంచి 9 వరకు సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో దరఖాస్తులు తీసుకుని పూర్తి చేసినవి సమర్పించాలని సూచించారు.

APP- Play Store 8374315777 9491601342
RS REDDY INSTITUTE

అత్యుత్తమ విద్య అందించడానికే సీఓఈ

గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి స్పష్టీకరణ

విశాఖపట్నం, న్యూస్‌టుడే: 'గిరిజన విద్యార్థులకు అత్యుత్తమ విద్య అందించాలనే ఉద్దేశంతో విశాఖలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రభుత్వానికి పిల్లల భవిష్యత్తు ముఖ్యం. తల్లిదండ్రుల కోరిక ప్రకారం చేయడానికి ప్రయత్నం చేస్తాం' అని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో సోమవారం గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి గౌతమి, కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి రాష్ట్రవ్యాప్తంగా 6 సీవోఈలు ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో ఎస్సీలకు మూడు, ఎస్టీలకు ఒకటి, బీసీలకు రెండు చొప్పున ఏర్పాటు చేశాం. ఎస్టీలకు మారికవలసలో సిద్ధం చేస్తున్నాం. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు 150 చొప్పున సీట్లు కేటాయించాం. ఎంపీసీ 300, బైపీసీ 300 సీట్లు కలిపి 600 మందికి ఇక్కడ వసతి కల్పిస్తున్నాం. విద్యా సంవత్సరం నష్టపోకుండా మారికవలసలోని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల సమ్మతితో సమీపంలోని శ్రీకృష్ణాపురం, మారికవలస బాలికల పాఠశాలలో సర్దుబాటు చేశాం. మాడుగుల ప్రాంతానికి చెందిన 39 మందిని వారి కోరిక మేరకు పంపాం. 26న పాడేరు వద్ద కొందరు బస్సు ఆపి ధర్నా చేయడంతో తిరిగి మారికవలసలో కొనసాగించాలని నిర్ణయించాం. ప్రస్తుతం మారికవలస, శ్రీకృష్ణాపురంలో విద్యార్థులు సంతృప్తిగా ఉన్నారు' అని నాయక్ స్పష్టం చేశారు.

కాయ్‌రాజాకాయ్ చూసీచూడనట్టు వదిలెయ్

రూ.లక్షల్లో జోరుగా పందేలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

నర్సీపట్నం మండలం బయ్యపురెడ్డిపాలెం, గొలుగొండ మండలం కశిమి రోడ్డులోని జీడితోటల్లో చిత్తులాట, కోసు ఆటలు జోరుగా సాగుతున్నాయని స్పెషల్ బ్రాంచి సిబ్బందికి కొద్దిరోజుల కిందట సమాచారం అందింది. శాంతిభద్రతలు, స్పెషల్ బ్రాంచి పోలీసులు సంయుక్తంగా రెండు రోజుల కిందట ఆకస్మిక దాడి చేశారు. ఓ జీడితోటలో 40కి పైగా బైకులున్నాయి. వచ్చిందని పోలీసులని గుర్తించగానే కొందరు అప్రమత్తమై బైకులతో పారిపోయారు. తక్కువ మంది సిబ్బందే వెళ్లినప్పటికీ 20 బైకులను స్వాధీనం చేసుకుని, ఆరుగురిని పట్టుకున్నారు. నలుగురి వద్ద రూ.1.05 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

■ ఈ ప్రాంత జీడితోటలపై గ్రామీణ సీఐ రేవతమ్మ పర్యవేక్షణలో పోలీసులు పలుమార్లు డ్రోన్ ఎగరవేసినా జాడ కనిపెట్టలేకపోయారు. జూదాల్లో ఆరితేరిన చేరిన కొందరు ఇది నర్సీపట్నం టౌన్ పరిధి కాదు.. మీరెందుకు వచ్చారని గద్దించినట్లు మాట్లాడటం చూస్తే.. ఎవరి అండతోనో ఇదంతా జరుగుతోందన్న అనుమానం వ్యక్తమవుతోంది. మీరు స్వాధీనం చేసుకున్న బైకు మా వాడిది.. వదిలేయండి అని కొందరు 'పెద్దలు' ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. జరిగిందేదో జరిగిపోయింది.. కఠిన చర్యలేవీ వద్దని సూచించినట్లు తెలిసింది.

లింగాపురం- కశిమి సమీపంలోని జీడితోటలో జూదాలకు సిద్ధం చేసిన ప్రదేశం

■ జూదాలను కొందరు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసి సదుపాయాలు కల్పించినందుకు జూదంలో పాల్గొనే వారంతా నిర్ణీత మొత్తాన్ని నిర్వాహకులకు చెల్లిస్తున్నారు. చిత్తులాట మొదలై నిమిషాల వ్యవధిలో ముగుస్తుంది. వేల రూపాయలు చేతులు మారుతాయి. కోసు ఆటగా వ్యవహరించే జూదంలోనూ వేల రూపాయలు చేతులు మారుతున్నాయి. అల్లూరి జిల్లా కొయ్యూరు సరిహద్దులో గొలుగొండ మండలం చోద్యం శివారు ప్రాంతాలు, చోడవరం నియోజకవర్గ పరిధి రోలుగుంట సరిహద్దులో ఏటిగైరంపేట శివారు, కశింకోట మండల సరిహద్దులో మాకవరపాలెం మండలం బూరుగుపాలెం సమీప ప్రాంతాల్లోనూ కోసాట, చిత్తులాటలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.

■ శివారు ప్రాంతాలు ఒకప్పుడు ప్రశాంతంగా ఉండేవి. ఇప్పుడు పలుచోట్ల నేరగాళ్లకు, ఆకతాయిలకు అడ్డాగా మారాయి. జనసంచారం తక్కువగా ఉండడంతో ఏం చేసినా ఎవరూ ఏం చేయలేరన్న ధీమాతో కొందరు జీడితోటలను అడ్డాగా చేసుకుని జూదాల నిర్వహణకు తెగబడుతున్నారు. జనసంచారం తక్కువగా ఉండడం, సీసీ కెమెరాలు లేకపోవడం, పోలీసుల గస్తీ ఉండకపోవడం జూదరులకు కలిసొస్తోంది. ఎక్కువగా యువత వ్యసనాలకు బానిసై డబ్బు పోగొట్టుకుంటున్నారు. నేరగాళ్లు పెచ్చుమీరక ముందే పోలీసులు కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

ఇసుకలో దాక్కొని.. పీతలను పట్టేసి

భారీ ఆకారంతో కనిపించే టేకు చేప చూపరులను ఎంతగా ఆకట్టుకుంటుందో... దాని ఆహార వేట అంతే ఆసక్తికరంగా ఉంటుంది. చదునైన శరీరం, రెక్కల మాదిరి విస్తరించిన పక్క భాగాలు, పొడవైన తోకతో కనిపించే ఈచేపలు సోమవారం పూడిమడక మత్స్యకారులకు చిక్కాయి. లోతైన సముద్రంలో జీవించే ఇవి పీతలు, చిన్న చేపలు, నత్తలు, రొయ్యలను ఆహారంగా తీసుకుంటూ మత్స్యకారులకు అరుదుగా చిక్కుతాయి. చదునైన శరీరమే ఆయుధంగా ఇసుకలో దాగి వేటచేస్తుందని మత్స్యకారులు తెలిపారు. కళ్లు శరీరంపై ఉంటూ, నోరు కింద భాగంగా ఉన్న టేకు చేపలు నిశ్శబ్దంగా వేట సాగిస్తాయని మత్స్య అభివృద్ధి అధికారి రవితేజ తెలిపారు. సొర చేప జాతికి చెందిన టేకు చేపలు పదునైన పళ్లు, మృదువైన అస్థిపంజరం కలిగి ఉంటాయని, సముద్ర అడుగున లభించే పెంకులాంటి జీవులను సైతం ఆహారంగా తీసుకుంటాయన్నారు.

మత్స్యకారులకు చిక్కిన టేకు చేప

తోకది కీలక పాత్ర..: టేకు చేప పొడవైన తోకను కేవలం దిశ మార్చుకోవడానికే కాకుండా ఆత్మరక్షణకు ఉపయోగిస్తుంది. తోక వద్ద ఉండే పదునైన ముల్లు కారణంగా దాని దగ్గరకు వెళ్లేందుకు ఇతర జీవులు సైతం వెనకాడతాయని మత్స్య అధికారులు తెలిపారు. వేట కోసం నెమ్మదిగా కదిలే ఇది ప్రమాదం ఎదురైతే వేగంగా స్పందిస్తుందన్నారు. దీంతోపాటు సముద్రాన్ని శుభ్రం చేయడంలో ఇది ప్రధాన పాత్ర వహిస్తుందన్నారు. వందల కేజీల నుంచి టన్ను బరువు వరకు పెరుగుతుందని రవితేజ తెలిపారు. – న్యూస్‌టుడే, అచ్యుతాపురం

ఖైదీలకు అందించే ఆహారంలో జాగ్రత్తలు తప్పనిసరి

నర్సీపట్నం, ఎలమంచిలి, న్యూస్‌టుడే: కారాగారంలో రిమాండు ఖైదీలకు అందించే ఆహారంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నర్సీపట్నం అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిత, ఎలమంచిలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.స్పందన సూచించారు. నర్సీపట్నం, ఎలమంచిలి ఉప కారాగారాలను సోమవారం సందర్శించారు. ఆహార పదార్థాలను రుచి చూశారు. పప్పులు నిల్వ చేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలన్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. బెయిల్ కావల్సిన వారికి న్యాయవాదిని సమకూరుస్తామని చెప్పారు. నర్సీపట్నం కారాగారంలో ఉన్న ఖైదీల్లో హెచ్ఐవీ బాధితుడిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎలమంచిలి కోర్టు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి స్పందన

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

చోడవరం, దేవరాపల్లి, న్యూస్‌టుడే: పదేళ్ల కిందట 144 కేజీల గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్షణ విధిస్తూ స్థానిక తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ సోమవారం సాయంత్రం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. శిక్ష పడిన వారిలో దేవరాపల్లికి చెందిన అతవ అచ్యుతరావు, తమిళనాడుకు చెందిన ఒచ్చు విజయకుమార్ ఉన్నారు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన వారిలో వీరిద్దరితోపాటు తమిళనాడుకు చెందిన శ్రావణకుమార్ ఉన్నారు. విచారణ పూర్తయి తీర్పు వెలువడేలోగా ఆయన మృతి చెందారని పోలీసులు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ సూర్యనారాయణ వ్యవహరించారు. ఈ కేసులో నాటి ఇన్‌స్పెక్టర్ ప్రసాదు, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ పాపునాయుడు, ఏపీపీ సూర్యనారాయణను ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ, జిల్లా సూపరింటెండెంట్ సుధీర్ అభినందించారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిత

నక్కపల్లి, న్యూస్‌టుడే: పాయకరావుపేటలో ఈ నెల 2న జరగనున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన విజయవంతం చేయాలని మంత్రి అనిత కోరారు. నక్కపల్లి మండలం సారిపల్లిపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గానికి చెందిన నాయకులతో సమావేశమయ్యారు. పోలవరం నీటికి సీఎం జలహారతి ఇచ్చిన తర్వాత సభలో పాల్గొంటారన్నారు. ఇందులో రైతులు భారీ ఎత్తున భాగస్వామ్యం చేయాలన్నారు. జనాల కోసం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని వివరించారు. నాయకులంతా అధికారులతో సమన్వయం చేసుకుని సమష్టి కృషితో దీన్ని జయప్రదం చేయాలన్నారు. కొప్పి బాలాజీ, కొప్పిశెట్టి వెంకటేష్, లాలం కాశీనాయుడు, కురందాసు నూకరాజు, దేవర సత్యనారాయణ, అమలకంటి అబద్ధం, యేజర్ల వినోద్‌రాజు, పెట్ల లింగనాయుడు, వైబోయిన రమణ, జానకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞంలా రాష్ట్రంలో అభివృద్ధి పనులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: యజ్ఞంలా రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో జలహారతి కార్యక్రమం సమావేశం సోమవారం జరిగింది. దీనికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందం, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, తెదేపా జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు హాజరయ్యారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో తెదేపా పనిచేస్తోందన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. భారీస్థాయిలో నియోజకవర్గం నుంచి జనాలను తరలించాలని సూచించారు. పట్టణ అధ్యక్షులు నానాజీ, నియోజకవర్గస్థాయి నాయకులు పీలా తులసీరామ్, మళ్ల చినబాబు, కర్రి అబిబాబు, మేరుగు బాపునాయుడు, పలివెల విస్సయ్యనాయుడు, రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందం, తెదేపా జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, చలపతిరావు, నాగేశ్వరరావు

2,50,725 మందికి పింఛన్ల పంపిణీ నేడు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: అనకాపల్లి జీవీఎంసీ, నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీలు, జిల్లాలోని 24 మండలాల పరిధిలో మంగళవారం 2,50,725 మంది లబ్ధిదారులకు రూ.106 కోట్లు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు అధికారి శచీదేవి చెప్పారు. ఉదయం 7 గంటల నుంచే సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛను సొమ్ము అందజేస్తారన్నారు. లబ్ధిదారులు ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు.

కంపెనీలో ఉద్యోగి ఆత్మహత్య

రాంబిల్లి, న్యూస్‌టుడే: అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలోని (సెజ్) నవోపార్ ఫార్మా కంపెనీలో కెమిస్టుగా పనిచేస్తున్న పి.నాగేశ్వరరావు (48) సోమవారం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారని సీఐ నరసింగరావు చెప్పారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి చెందిన ఈయన కొంతకాలంగా కంపెనీలో పనిచేస్తూ కుటుంబంతో ఎలమంచిలిలో నివాసం ఉంటున్నారు. సోమవారం విధులకు హాజరై మధ్యాహ్నం కంపెనీ ఆవరణలో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. పోలీసులు కంపెనీకి చేరుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు.

డేటా సెంటర్ ఏర్పాటుకు భూసర్వే పూర్తి

రెన్యూ గ్రీన్ డేటా సెంటర్‌కు గుర్తించిన భూములు

నక్కపల్లి, న్యూస్‌టుడే: తూటిపాల రెవెన్యూ పరిధిలో ఏర్పాటు కానున్న రెన్యూ గ్రీన్ డేటా సెంటర్‌కు భూసర్వే పూర్తయిందని తహసీల్దార్ నరసింహ చెప్పారు. సుమారు 433 ఎకరాల్లో డేటా సెంటర్ ఏర్పాటు కానుందన్నారు. ఇప్పటికే ఈ భూమి తాడిగాలు ఆడేలంతో త్వరలో గ్రామ సభ నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరించనున్నట్లు పేర్కొన్నారు.

విధులకు వైద్యుడి గైర్హాజరుపై విచారణ

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి-2 ఉదయ్ కుమార్ విధులకు గైర్హాజరు కావడంపై జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ సోమవారం విచారణ జరిపారు. ప్రధాన వైద్యాధికారి నవీన్ ఒక్కరే విధులకు రావడం, రోగులకు సేవలు అందించడం చేస్తున్నారు. రెండో వైద్యాధికారి ఉదయ్ కుమార్ తరచూ సాయంత్రం వేళల్లో వచ్చి వెళ్తుంటారనే ఆరోపణలున్నాయి. దీనిపై గ్రామస్థులు పలుమార్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారికి (డీఎంహెచ్‌ఓ) ఫిర్యాదులు చేశారు. ఈ ఆరోపణలపై డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు చంద్రశేఖర్ సోమవారం ఆరోగ్య కేంద్రానికి వచ్చి విచారణ జరిపారు. నివేదికను డీఎంహెచ్‌ఓకు అందజేస్తామని తెలిపారు.

పీహెచ్‌సీ సిబ్బందిని విచారణ చేస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి చంద్రశేఖర్

తగ్గిన వరి సాగు విస్తీర్ణం

రావణాపల్లిలో ఎండిపోతున్న వరినాట్లను పరిశీలిస్తున్న ఏవో శివరాంప్రసాద్

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు మండలంలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 2091 హెక్టార్లు కాగా.. ఇప్పటివరకు 1200 హెక్టార్లలో మాత్రమే వరినాట్లు వేశారు. మంప పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న ఏవో శివరాం ప్రసాద్ రావణాపల్లిలో నీరు లేక ఎండిపోతున్న వరి నాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జూన్‌లో 145 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 99 మి.మీ. నమోదైందన్నారు. జులైలో 264 మి.మీ.కు 143 మి.మీ, ఆగస్టులో 219 మి.మీకు 59 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో నాట్లు వేయలేమని రైతులు తెలిపారన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా అపరాలు వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. 800 హెక్టార్లలో మినుము, పెసర, 400 హెక్టార్లలో రాజ్‌మా విత్తనాలు కావాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదించామని తెలిపారు.

లక్ష్యసాధనకు నిరంతర కృషి

కొయ్యూరు, న్యూస్‌టుడే: విద్యార్థినులంతా ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని.. వాటి సాధన కోసం నిరంతరం కృషిచేయాలని కొయ్యూరు సీఐ బి.శ్రీనివాసరావు అన్నారు. మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. కెరీర్ గైడెన్స్, మహిళా చట్టాలు, మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు, సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రేమ పేరుతో జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థినులంతా క్రమశిక్షణతో చదువుకోవాలని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ సుధ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల బలోపేతం

సీలేరు, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లో ఏళ్ల తరబడిగా నివాసం ఉంటున్న మాదిగల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అనుబంధ సంఘాలను బలోపేతం చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు మోర్తా బుజ్జిబాబు అన్నారు. గూడెంకొత్తవీధి మండలం ధారకొండలో అనుబంధ సంఘాలైన మహాజన సోషల్‌పార్టీ (ఎంఎస్‌పీ), మండల మహిళా సమితి (ఎంఎంఎస్) కమిటీల నియామకం జరిగింది. ఎమ్మార్పీఎస్ గూడెంకొత్తవీధి మండల అధ్యక్షులుగా కండెలి ధారబాబు, అధికారి ప్రతినిధిగా గోరింట్ల ఫిలోస్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా తాతపూడి బాబులు, అధికార ప్రతినిధిగా చిందాడ రాంబాబు, ఎంఎంస్ అధ్యక్షురాలిగా కంబాలి రాము, అధికార ప్రతినిధిగా కలిదిండి బేబీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ధారబాబు, చిన్న, రాజు, నాగేశ్వరరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ సంఘాల నాయకులతో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుజ్జిబాబు

రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించండి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు సోమవారం నిరసన చేపట్టారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒప్పంద ఉద్యోగులు రమేష్, నాగమణి, నీలిమ, సురేష్, వసంత, రుక్మిణి, శాంతకుమారి, బేగం, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.


ముంచంగిపుట్టు సీహెచ్‌సీ వద్ద ఉద్యోగుల ధర్నా

సైబర్ నేరాలపై అప్రమత్తం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నాని సూచించారు. బంగారుమెట్ట పంచాయతీలోని తుస్సాపల్లి గ్రామంలో సోమవారం గిరిజనులకు అవగాహన కల్పించారు. మహిళల భద్రత, బాల్యవివాహాలతో అనర్థాలు, గంజాయి సాగు, రవాణాతో నష్టాలను వివరించారు. వాహనచోదకులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. పోలీసు సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తుస్సాపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై నాని

కొబ్బరిలో బెండ.. లేదిక బెంగ

కొబ్బరిలో సాగు చేస్తున్న బెండ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: సాగు లాభసాటిగా మారాలంటే ఆలోచనల్లోనూ మార్పు రావాల్సిందే. ఒకే పంటను పండించే కన్నా.. ఉన్న భూమిలోనే రెండు, మూడు రకాల పంటలు సాగు చేస్తే అధికాదాయం పొందవచ్చని ఆచరణలో నిరూపిస్తున్నారు. పెంటకోటకు చెందిన రైతు బి.కొండబాబు. రెండు దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తున్న ఈయన పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామంలో కొంత భూమిని కౌలుకు తీసుకున్నారు. ఎకరా విస్తీర్ణంలో మిరప వేశారు. ఆరు నెలల్లో 20 టన్నుల దిగుబడి వచ్చింది. సగటున కేజీ రూ.15 నుంచి రూ.20 చొప్పున విక్రయించారు. దిగుబడి తగ్గే సమయంలో మిరప మొక్కల మధ్య బీర సాగు చేపట్టారు.

★ మిరప మొక్కలను ఆధారంగా చేసుకుని బీర పాదులు పెరిగేలా ఏర్పాట్లు చూశారు. కలుపు నివారణకు ప్లాస్టిక్ కవర్లతో మల్చింగ్ చేశారు. పక్కనే ఉన్న కొబ్బరి తోటలో అంతర పంటగా 40 సెంట్ల విస్తీర్ణంలో బెండ సాగుకు శ్రీకారం చుట్టారు. పెట్టుబడి రూ.20 వేల వరకు కాగా 50 రోజుల్లోనే పంట చేతికొచ్చింది. రోజుకు 50 కేజీల కాయలను మార్కెట్‌లో కేజీ రూ.15 చొప్పున విక్రయిస్తున్నారు.

పంట మార్పిడి.. తక్కువ పెట్టుబడి: ఒకే పంటను ఎప్పుడూ పండించను. పంట మార్పిడి చేస్తుంటా. ఏకకాలంలో రెండు, మూడు పంటలు పండిస్తున్నా. ఒక పంటకు గిట్టుబాటు ధర రాకపోయినా ఇబ్బంది లేదు. సేంద్రియ పద్ధతులను అనుసరిస్తూ క్రిమిసంహారక మందుల వినియోగాన్ని చాలా వరకు తగ్గించా.
– కొండబాబు, రైతు

మిశ్రమ పంటలతో.. ఆదాయం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ఎక్కువ మంది రైతులు ఒకే రకం పంట వేస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే నష్టపోతుంటారు. కొందరు మిశ్రమ పంటల పండిస్తూ నిశ్చింతగా ఉంటున్నారు. ఒక పంట దెబ్బతిన్నా.. రెండో పంటతో నష్టం పూడ్చుకుంటున్నారు. గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ ఊబపాలెం గ్రామానికి చెందిన గిరిజన రైతులు ఏడాది పొడవునా కాయగూరలు, ఆకుకూరలు పండిస్తున్నారు. బీన్స్, ముల్లంగి, బరబాటీతోపాటు కాకర, బెండ, బీరను పందిరి సాగు చేస్తున్నారు. అంతర పంటలుగా మొక్కజొన్న, పచ్చిమిరప, వంగ, అల్లం పండిస్తున్నారు. వీటితోపాటు తోటకూర, పాలకూర, బచ్చలి కూర, చుక్కకూర, గోంగూర, కొత్తిమీర సాగు చేస్తున్నారు.

తక్కువ విస్తీర్ణంలో సాగవుతున్న మిశ్రమ పంటలు

★ కాయగూరల సాగులో ఇప్పటివరకూ నష్టమైతే రాలేదు. కొద్దిపాటి భూమిలోనే కాలానుగుణంగా ఏడాది పొడవునా అన్ని రకాల కాయగూరలు, ఆకు, దుంపకూరలు, పందిరి సాగు కింద పలు రకాల పంటలను పండిస్తున్నాం. కాయగూరలను ఎప్పటికప్పుడు వారపు సంతల్లో విక్రయిస్తుంటాం. అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల కొన్ని పంటలు దెబ్బతిన్నా మిశ్రమ పంటల సాగు వల్ల మొత్తంగా నష్టపోయే పరిస్థితి అయితే లేదని రైతులు చెబుతున్నారు.

ఏడాది పొడవునా మొక్కజొన్న

అల్లూరి జిల్లాలో కొందరు రైతులు మొక్కజొన్న సాగు చేస్తూ మేలైన దిగుబడులు సాధిస్తున్నారు. నీటి వసతి ఉన్నచోట ఏడాది పొడవునా దేశవాళీ మొక్కజొన్నను పండిస్తుండగా, కొందరు ప్రత్యేకంగా తీపి మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. చింతపల్లి మండలం చౌడుపల్లి, కొత్తపాలెం, పెదబరడ ప్రాంతాల్లో మాలీ రైతులు దేశవాళీ రకంతోపాటు అమెరికన్ స్వీట్ కార్న్ సాగు చేస్తున్నారు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ కాయగూరలతోపాటు మొక్కజొన్నను వాణిజ్య పరంగా పండిస్తున్నారు. –న్యూస్‌టుడే, చింతపల్లి

నీటి సదుపాయం ఉంటే చాలు

★ కొయ్యూరు మండలం డౌనూరు మొదలు చింతపల్లి మండలంలో పలు పర్యాటక ప్రాంతాలున్నాయి. ఎర్రవరం వద్ద జలపాతాలతోపాటు లంబసింగి ఘాట్, తాజంగి, చెరువులవెనం సందర్శనకు వచ్చే పర్యాటకులకు మొక్కజొన్న పొత్తులను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. మైదాన ప్రాంత వ్యాపారులు ముందుగానే తోటలను కొనుగోలు చేసి మొక్కజొన్న దిగుబడులను పట్టణ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

★ 'రెండు ఎకరాల పొలం ఉంది. అందులో సగం కాయగూరలు, ఆకుకూరలు పండిస్తుంటాం. మిగతా సగంలో మొక్కజొన్న సాగు ద్వారా ఏడాది పొడవునా ఆదాయం వస్తోంది. ఎకరాకు రూ.పది వేల వరకు పెట్టుబడి అవుతోంది. ఖర్చులన్నీ పోను రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం వస్తోంది. మూడు నెలలకోసారి పంట చేతికొస్తోంది. స్థానికంగానే మార్కెటింగ్ సదుపాయం ఉండటం వల్ల రవాణా ఖర్చులు మిగులుతున్నాయ'ని చౌడుపల్లి రైతు **కిలో అర్జున్** చెబుతున్నారు.

మన్యం నుంచి మైదానానికి ఎగుమతి అవుతున్న మొక్కజొన్న

రాజ్‌మా దిగుబడులు పెరగాలంటే..

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

?: రెండేళ్లుగా రాజ్‌మా సాగు చేస్తున్నా. సరైన దిగుబడులు రావడం లేదు. పెరగాలంటే ఏం చేయాలి. – **రాజారావు, కొత్తూరు**

✔: రాజ్‌మా విత్తనాలను రైజోబియం (ద్రవరూప జీవన ఎరువు)లో శుద్ధి చేయాలి. ఆ తర్వాత పొలంలో విత్తనాలు వేస్తే ఫలితం ఉంటుంది.

?: వలిసెల్లో అధిక దిగుబడినిచ్చే రకాలున్నాయా.
– **కంకిపాటి సత్తిబాబు, ఏబులం**

✔: మన్యం వాతావరణం అనుకూలంగా ఉన్నప్పటికీ ఈ ప్రాంతానికి అనువైన రకాలను ఎంపిక చేసుకోవడమే కీలకం. జేఎన్ఎస్-28 రకం ఇక్కడి వాతావరణంలో అధిక దిగుబడినిస్తుంది.

?: వరి నారు ఇప్పుడు నాటొచ్చా.
– **రాంబాబు, పాడేరు**

✔: సెప్టెంబరు సమీపించడం వల్ల ఇప్పుడు వరి సాగుకు ఆస్కారం లేదు. స్వల్పకాలిక రకాలు వేసుకున్నా.. రానున్న రోజుల్లో వర్షాలు లేకపోతే పంట దెబ్బతింటుంది. ప్రత్యామ్నాయంగా వలిసెలు, రాజ్‌మా, రాగులు వంటివి సాగు చేయడం ఉత్తమం.

రైతుల ప్రశ్నలు, సందేహాలకు పాడేరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త, విస్తరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త **డాక్టర్ పీబీ ప్రదీప్‌కుమార్** సమాధానాలు ఇచ్చారు.
– న్యూస్‌టుడే, చింతపల్లి

సాగులో.. సందేహాలా
పంటల సాగులో సలహాలు, సందేహాల నివృత్తికి ఫోన్ చేయవచ్చు. అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త **దాడి ఉమామహేశ్వరరావు** సమాధానాలు ఇస్తారు. మంగళవారం ఉదయం 10–11 గంటల మధ్య **94410 75852** నంబరును సంప్రదించవచ్చు.

మార్కెట్‌లో బెల్లం ధరలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా అన్ని రకాల బెల్లం ధరలు తగ్గాయి. రంగుల ధరలు వంద కేజీలకు రూ.490, మధ్య రకాలు రూ.1,080, నాసి రకాలు రూ.810 తగ్గాయి.

రకం	రంగులు	మధ్య	నాసి
గత వారం (రూ.)	5,820	5,700	5,100
ఈ వారం (రూ.)	5,330	4,620	4,290

గిరిజన గురుకులాన్ని కొనసాగించాలని ఆందోళన

కొమ్మాది, న్యూస్‌టుడే: మారికవలస గిరిజన గురుకుల బాలుర పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు పోరుబాట పట్టారు. 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' పేరిట గురుకులంలో చదువుతున్న 480మంది విద్యార్థులను ఇతర ప్రాంతాలకు తరలించడాన్ని నిరసిస్తూ సోమవారం పాఠశాల ప్రధాన గేటు ఎదుట గిరిజన సంఘాల నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. వీరికి మద్దతుగా ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ మంత్రి బాలరాజు, జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జీసీసీ మాజీ ఛైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, సీపీఎం నాయకులు గంగారావు తరలివచ్చారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ పాఠశాల విషయంలో ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. విద్యార్థులను అకస్మాత్తుగా ఇతర ప్రాంతాలకు తరలించడం వల్ల పలు ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. భీమిలి ఆర్డీవో సంగీత్‌మాథుర్, ఏసీపీలు వెంకటరావు, అప్పలరాజు ఆందోళన చేస్తున్న నేతలతో చర్చలు జరిపారు. విద్యార్థులంతా ఇక్కడే తమ చదువును కొనసాగించేలా ప్రభుత్వం జీవో ఇచ్చే వరకూ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. రాత్రి అయినా వారంతా ప్రధాన గేటు ముందు బైఠాయించి నిరసన కొనసాగించారు. రాత్రి నిద్రించేందుకు తెచ్చిన పరుపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నప్పటికీ వెనకడుగు వేయలేదు. విద్యార్థుల తల్లిదండ్రులకు స్థానిక నేతలు భోజనాలు సమకూర్చారు.

గురుకులం ప్రధాన గేటు వద్ద బైఠాయించిన విద్యార్థుల తల్లిదండ్రులు, వైకాపా నేతలు

చదువుతోపాటు క్రీడలూ అవసరం

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చదువుతోపాటు క్రీడలు అవసరమని అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కుసుమకుమారి అన్నారు. గతనెల 29న స్పోర్ట్సుడే సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడాపోటీల విజేతలకు సోమవారం బహుమతి ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026లో జావెలిన్‌త్రో విభాగంలో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించిన కళాశాల విద్యార్థిని టి.జ్యోతికను సత్కరించారు. క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. పీడీ జ్యోతి, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతికను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ కుసుమకుమారి, అధ్యాపకులు

చిరుధాన్యాల రైతులకు టార్పాలిన్ల పంపిణీ

జి.మాడుగుల, న్యూస్‌టుడే: చిరుధాన్యాలు సాగు చేస్తున్న రైతులు టార్పాలిన్లను సద్వినియోగం చేసుకోవాలని మత్స్యదేవత ఎఫ్‌పీవో సీఈవో హనుమంతరావు పేర్కొన్నారు. జి.మాడుగుల పంచాయతీ జి.ఎం.కొత్తూరులో భారతీయ చిరుధాన్యాల సంస్థ (ఐఐఎంఆర్) ఆధ్వర్యంలో టీఎస్‌పీ నిధులతో రైతులకు టార్పాలిన్లను సోమవారం పంపిణీ చేశారు. జి.మాడుగుల మండలంలో 1200 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు అవుతున్నాయన్నారు. అక్టోబర్ మూడో వారంలో కోతకు రానున్నట్లు చెప్పారు. నూర్పిడి సమయంలో ఉపయోగపడేలా ముందుస్తుగా వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరల కల్పనకు ఎఫ్‌పీవో కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎఫ్‌పీవో సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

టార్పాలిన్లతో ఎఫ్‌పీవో సీఈవో హనుమంతరావు, రైతులు

సాంకేతిక సమస్యతో పథకాలకు దూరం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి పంచాయతీకి చెందిన చిన్న అగ్రహారం, పెద్ద అగ్రహారం గ్రామాల్లో సుమారు 80 గిరిజన రైతు కుటుంబాలకు చెందిన భూముల వివరాలన్నీ దుప్పిలవాడ పంచాయతీలోకి వెళ్లిపోయాయి. సాంకేతికపరమైన సమస్య వల్ల ఇక్కడ రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు అందటంలేదు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని గాలికొండ పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు, సీపీఎం మండల కార్యదర్శి అప్పురంగి బుజ్జిబాబు కోరారు. సోమవారం బాధిత గ్రామాలకు చెందిన రైతులతో కలిసి తహసీల్దారు అన్నాజీరావుకు వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు వంతల అరుణ్‌కుమార్, గిరిజన సంఘం మండల నాయకులు పరమేశ్వరరావు, పెసా కమిటీ సభ్యులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తహసీల్దారు పేర్కొన్నారు.

అగ్రహారం గిరిజనులతో కలసి మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు

రాజ్‌మా సాగుతో ఆర్థికాభివృద్ధి

విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, అధికారులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: రాజ్‌మా సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీపీ అప్పలరాజు పేర్కొన్నారు. జి.మాడుగుల సచివాలయంలో సోమవారం రాజ్‌మా విత్తనాలను రాయితీపై రైతులకు అందజేశారు. రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బి.గాయత్రి తెలిపారు. ప్రతి రైతు ఈ-పంట, ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి విజయరాజు, కూటమి నాయకులు, పోలీసు వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'బొప్పరాజుపై విమర్శలు సరికాదు'

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యలపై నిబద్ధతతో పనిచేస్తున్న జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుపై భూపతిరాజు రవీంద్రరాజు విమర్శలు చేయడం మంచిదికాదని రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శశిధర్ సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	124	120
లైవ్	151	140
డ్రెస్డ్	234	250
స్కిన్‌లెస్	264	260

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు: 89853 66570 | అరకులోయ: 63034 86346 | చింతపల్లి: 94404 07658

పెదబయలు, న్యూస్‌టుడే: పెదబయలులో చినుకుపడితే రహదారులు జలమయ మవుతున్నాయి. కొన్ని వీధులకు వెళ్లేందుకు వీలు పడటం లేదు.- కె.రాజుబాబు, పెదబయలు, ✓: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.- శ్యాంసుందర్‌రావు, ఎంపీడీఓ, పెదబయలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: కిలగాడలో పాఠశాల సముదాయ భవనం నిరుపయోగంగా ఉంది. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన భవనాన్ని వినియోగించడం లేదు. దీన్ని వినియోగంలోకి తీసుకురావాలి. - కృష్ణారావు, స్థానికుడు, ✓: దీనికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొస్తాం. - కృష్ణమూర్తి, ఎంఈఓ, ముంచంగిపుట్టు

చెట్టు కూలి రాకపోకలకు అంతరాయం

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు ఘాట్‌రోడ్డులోని డైమండ్ పార్కు సమీపంలో సోమవారం ఉదయం ఓ చెట్టు రహదారికి అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ చెట్టును రోడ్డు పక్కకు తప్పించడానికి స్థానికులు, ప్రయాణికులు శ్రమించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని.. చెట్టును రోడ్డు పక్కకు తొలగించారు. దీంతో వాహనాలు ముందుకు కదిలాయి.

చెట్టును తొలగిస్తున్న వాహనచోదకులు

ఇక్కడింతే.. ఇంటికెళ్లేవరకూ చింతే!

చింతపల్లి ఆసుపత్రిలో సౌకర్యాల లేమి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో సౌకర్యాల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది రోగులు వివిధ ఆరోగ్య సమస్యలతో ఇక్కడకు వస్తుంటారు. నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలందించాలనే లక్ష్యంతో 2021లో అప్పటి ప్రభుత్వం వంద పడకల ఆసుపత్రిగా దీన్ని అప్‌గ్రేడ్ చేసింది. భవన నిర్మాణానికి రూ.28 కోట్ల నిధులు మంజూరు చేసింది. త్వరలో పనులు పూర్తి చేసి ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తామని వాగ్దానం చేసినా.. ఇప్పటివరకు పనులు పూర్తి చేయలేదు. పాత ఆసుపత్రి పడకలు సరిపోక రోగులు అవస్థలు పడుతున్నారు.

★ ప్రస్తుతం వైద్య సేవలు అందిస్తున్న 50 పడకల ఆసుపత్రినే కొంత మార్పుచేశారు.

చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో నేలపై పడుకున్న రోగులు

బయట రేకుల షెడ్డు ఏర్పాటు చేసి అందులోనే అత్యవసర సేవలు అందిస్తున్నారు. మందుల నిల్వ గది చాలక బయటే పెట్టెల్లో మందులను నిల్వ ఉంచుతున్నారు. ప్రస్తుతం రోగుల తాకిడి ఎక్కువగా ఉండడంతో పడకలు సరిపోవడం లేదు. రోజూ చుట్టు పక్కల గ్రామాలు, పీహెచ్‌సీల నుంచి మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో బాధితులు వస్తున్నారు. పడకలు చాలక కొంతమందిని నేలపై పడుకోబెట్టి వైద్యం అందించాల్సి వస్తోంది.

వైద్యుల కొరత

ఆసుపత్రిలో ఎక్కువ కాలంగా వైద్యుల కొరత వేధిస్తోంది. ఇక్కడ 24 మంది వైద్యులు అవసరం ఉండగా.. ప్రస్తుతం 13 మంది సేవలందిస్తున్నారు. చిన్నపిల్లల వైద్యులు లేక ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. చికిత్స కోసం రూ.వేలల్లో ఖర్చు చేస్తున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు, ఎమర్జెన్సీ రోగులకు ఇక్కడ ప్రథమ చికిత్స అందించి.. నర్సీపట్నం, పాడేరు ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాలకు చింతపల్లి ఏరియా ఆసుపత్రి పెద్ద దిక్కు. ఇక్కడ సరైన సదుపాయాలు, వైద్యులు లేక పోవడంతో అవస్థలు తప్పడం లేదు. వంద పడకల ఆసుపత్రి ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వైద్యులను నియమించనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారని, ఉన్న సౌకర్యాలతో రోగులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ నేడు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి రైతు సేవా కేంద్రంలో గిరి రైతులకు మంగళవారం రాజ్‌మా విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సురేష్ సోమవారం తెలిపారు. మండలానికి ఇప్పటివరకు 805 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు వచ్చాయన్నారు. ఇప్పటికే అన్ని రైతు సేవా కేంద్రాలకు తరలించామన్నారు. విత్తన రకం, నాణ్యతపై పరీక్షలకు పంపించామన్నారు.. అక్కడి నుంచి వచ్చిన స్పష్టత మేరకు విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. డి-కృషి యాప్ ద్వారా రైతు వేలిముద్రలు తీసుకుని పంపిణీ చేస్తామని వివరించారు.

సర్వసభ్య సమావేశం రేపు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 2న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీఓ సీతయ్య తెలిపారు. ఎంపీపీ ఈశ్వరి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని పేర్కొన్నారు.

అ వీ ఇ వీ

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గురుదొర, దేముడు సోమవారం డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాల నుంచి విద్యాబోధన చేపడుతున్న ఉపాధ్యాయులను టెట్ రాయాలని ఒత్తిడి చేయడం వల్ల వారు ఆందోళన చెందుతున్నారన్నారు.

అక్రమ వసూళ్లపై విచారణ

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: లోతుగెడ్డ పంచాయతీ చెరపల్లి గ్రామ రైతులకు మొక్కలు పంపిణీ చేసిన సందర్భంలో కొందరు వీబీజీ రామ్‌జీ సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ప్రచారమైంది. దీనిపై ఏపీడీ వెంకటరావు, ఏపీవో రామ్‌ప్రసాద్ సోమవారం గ్రామంలో విచారణ జరిపారు. రైతుల వద్ద నుంచి సొమ్ములు వసూలు చేసినట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. సిబ్బంది నుంచి తీసుకుని తిరిగి గిరిజనులకు ఇచ్చినట్లు తెలిపారు.

చెరపల్లిలో వివరాలు సేకరిస్తున్న వీబీజీ రామ్‌జీ అధికారులు

త్వరితగతిన నిర్మాణ పనులు

కొయ్యూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని పీఆర్ ఏఈ రామకృష్ణను ఈఈ కొండయ్య పడాల్ ఆదేశించారు. శరభన్నపాలెం, కినపర్తి, బట్టపనుకుల పంచాయతీ భవన నిర్మాణాలు, శరభన్నపాలెం, వెలగలపాలెం హెల్త్ క్లినిక్‌ల పనులను సోమవారం ఈఈ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటించాలని పేర్కొన్నారు. డీఈ మాణిక్యం పాల్గొన్నారు.

శరభన్నపాలెం పంచాయతీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈఈ కొండయ్యపడాల్

వైద్య శిబిరం విజయవంతం

అరకులోయ, న్యూస్‌టుడే: బస్కి గ్రామంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. న్యూ కవనెంట్ కీపర్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. బస్కి పంచాయతీ పరిధిలోని సుమారు 10 గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు. వైద్యులు వరలక్ష్మి, కిరణ్ రోగులను పరీక్షించి సేవలు అందించారు.

మందులు అందజేస్తున్న సిబ్బంది

ప్రయాణం.. భయంభయం

లంబసింగి ఘాట్‌రోడ్లో ప్రయాణం భయంభయంగా సాగుతోంది. ప్రమాదకర మలుపుల వద్ద గతంలో నిర్మించిన రక్షణ గోడలు చాలాచోట్ల శిథిలమయ్యాయి. కొన్నిచోట్ల అసలు రక్షణ గోడలే లేవు. ఉన్నవి శిథిలం కావడంతో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంది. ఓచోట రక్షణ గోడకు భారీ రంధ్రం పడింది. నిత్యం రద్దీగా ఉండే లంబసింగి ఘాట్‌రోడ్లో దెబ్బతిన్న రక్షణ గోడలకు మరమ్మతులు చేపట్టాలని ఈప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు. - చింతపల్లి, న్యూస్‌టుడే

లంబసింగి ఘాట్‌రోడ్లో రక్షణ గోడకు భారీ రంధ్రం

శిథిలమైన రక్షణ గోడ

సచివాలయాలు పూర్తయ్యేదెన్నడు?

ఆర్వీనగర్‌లో అసంపూర్తిగా సచివాలయ భవనం

గూడెంకొత్తవీధి మండల కేంద్రం సహా, ఆర్వీనగర్‌లో సచివాలయ భవనాలు పూర్తికాక ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటైంది. ఆర్వీనగర్‌లో భవనం పూర్తికాకపోవడంతో తాత్కాలికంగా సచివాలయాన్ని ఏపీఎఫ్‌డీసీ నివాసగృహంలో నిర్వహిస్తున్నారు. అంతర్జాలం, విద్యుత్తు వంటి సమస్యల వల్ల సేవలకు ఇబ్బంది కలుగుతోంది. గూడెంకొత్తవీధి సచివాలయం పాత పంచాయతీ కార్యాలయంలోనే కొనసాగుతోంది. సాంకేతిక సమస్యలతో భవనాలు పూర్తికాలేదని అధికారులు చెబుతున్నారు. అసంపూర్తిగా ఉండిపోయిన భవనాలను పూర్తిచేయాలని ఈప్రాంతీయులు కోరుతున్నారు.- గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

మురుగు పారేదెలా?

పెదబయలులోని గాంధీబొమ్మ కేంద్రం వద్ద మురుగునీరు పారేందుకు అవకాశం లేకుండా పోయింది. ఇటీవల చిట్రాయిపుట్టు నుంచి బంగారుమెట్ట వరకు రహదారి విస్తరణ చేపట్టారు. గాంధీబొమ్మ వద్ద గతంలో ఉన్న తాత్కాలిక కాలువను మూసివేసి రహదారిని నిర్మించారు. దీని కారణంగా చెంతనే ఉన్న బోరు నీరు, మురుగు పారేందుకు అవకాశం లేకపోవడంతో రహదారి పక్కనే నిల్వ ఉంటోంది. దీంతో దోమలు విజృంభించి వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా గుత్తేదారు ఇష్టానుసారంగా విస్తరణ చేపట్టి చేతులు దులుపుకొన్నారన్నారు. అధికారులు స్పందించి మురుగు పారేందుకు కాలువ నిర్మించి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.
- పెదబయలు, న్యూస్‌టుడే

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

నిర్మాణంలో ఉన్న పెదకోనెల రహదారి

కూటమి ప్రభుత్వం చొరవతో గిరిజనుల రహదారి కల ఎట్టకేలకు నెరవేరుతోంది. అనంతగిరి మండలం ఎన్‌ఆర్‌పురం రోడ్డు నుంచి గాదిల్లోవ వరకు రహదారి నిర్మాణానికి గతంలో నిధులు మంజూరు చేశారు. గుత్తేదారుల తీరుతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం సుమారు రూ.7.8 కోట్లతో దాదాపు 8 కిలోమీటర్ల రహదారి పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పెదకోనెల మీదుగా నాయుడువలస సమీపం వరకు రోడ్డు పనులు చేపడుతున్నట్లు జేఈ గణేష్ తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.
- అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

'మీకోసం'లో అర్జీల వెల్లువ

ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ గ్రామాల్లో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో అర్జీలు వెల్లువెత్తాయి. బంగారుమెట్టలో ఎంపీడీఓ ధర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో 74 ఫిర్యాదులు అందాయి. వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. డుంబ్రిగుడ మండలంలోని కొర్రాయిలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తహసీల్దార్ శంకర్‌రావు, ఎంఈవో సుందర్‌రావు, అధికారులు అర్జీలు స్వీకరించారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో ప్రసాదరావు తెలిపారు. మంపలో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. పి.గంగవరం నుంచి టీటోరాళ్ల వరకు రహదారి నిర్మించాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా 30 వినతులు వచ్చాయని ఎంపీడీవో తెలిపారు. ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, రీసర్వే డీటీ అప్పన్న, ఏపీవో అప్పలరాజు, మాజీ సర్పంచి రాజుబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శివరామరాజు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి, చింతపల్లి గ్రామీణం: గూడెంకొత్తవీధి మండలంలో చెక్‌డ్యాంల నిర్మాణానికి జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఎంపీడీఓ రమణబాబు తెలిపారు. దామనాపల్లిలో పీజీఆర్ఎస్ నిర్వహించగా.. గిరిజనులు 35 వినతులు అందించారు. పశుసంవర్ధకశాఖ ఏడీ రమేష్, తాగునీటి సరఫరా విభాగం జేఈ కల్యాణ్‌రాం, డిప్యూటీ ఎంపీడీఓ జగదీష్, ఏవో ఇమ్మానుయేల్, మండల వ్యవసాయాధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు. చింతపల్లి పంచాయతీ చిన్నగెడ్డలో 10 అర్జీలు వచ్చాయని ఎంపీడీవో సీతామహాలక్ష్మి పేర్కొన్నారు.

అరకులోయ పట్టణం, జి.మాడుగుల, పాడేరు, న్యూస్‌టుడే: అరకులోయ మండలం ఇరగాయిలో ఎంపీడీఓ ప్రసాద్, డీటీ గోవింద్, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీలావణ్య ఆధ్వర్యంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పంచాయతీ పరిధిలో వివిధ సమస్యలపై 40 అర్జీలు అందాయి. డిప్యూటీ ఎంపీడీఓ మహేష్, ఈఓ రఘు తదితరులు పాల్గొన్నారు. వంజరిలో ఎంపీడీవో డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు 70 వినతులు అందించారు. పాడేరు మండలం తుంపాడలో 22 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎంపీడీఓ తేజరతన్ తెలిపారు.

బంగారుమెట్టలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కొయ్యూరులో ఎంపీడీవో ప్రసాదరావుకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు శివరామరాజు తదితరులు

ఈవీఎంల భద్రతపై నిర్లక్ష్యం తగదు

పాడేరు, న్యూస్‌టుడే: ఈవీఎంల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దని, పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని సంయుక్త కలెక్టర్ శ్రీపూజ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఈవీఎంల గోదాములను సోమవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి తనిఖీ చేశారు. భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ, సిబ్బంది విధులను పరిశీలించారు. గోదాము వద్ద 24 గంటల నిఘా కొనసాగించాలని సూచించారు. సీసీటీవీలు నిరంతరం పనిచేసేలా చూడాలని పేర్కొన్నారు. అనంతరం రిజిస్టరులో జేసీ సంతకం చేశారు. డీఆర్‌ఓ ఎం.వి.ఎస్.లోకేశ్వరరావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాము పరిశీలిస్తున్న జేసీ శ్రీపూజ, రాజకీయ పార్టీల నాయకులు

ఉద్యోగాలకు 19 మంది ఎంపిక

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన నిరుద్యోగులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ సూచించారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 25 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరిలో 19 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.20 వేల నుంచి 22,500 వరకు వేతనంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఉచిత రవాణా సదుపాయాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే ఉన్నత భవిష్యత్తు ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌పాత్రో, అధ్యాపకులు కోటేశ్వరరావు, కామేశ్వరరావు, జానకిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైనవారితో కంపెనీల ప్రతినిధులు

గిరిజనులకు పథకాలు అందేలా కృషి

గెడ్డ దాటుతున్న దేవదాసు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులకు పథకాలు అందేలా కృషి చేస్తానని జిల్లా విజిలెన్సు, మానిటరింగ్ కమిటీ సభ్యుడు దేవదాసు అన్నారు. గుమ్మ పంచాయతీ కర్రిగుడ, కడరేవు, మర్రిబంధ, కళ్యాణగుమ్మి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. గెడ్డలు దాటుకుంటూ ఆయా గ్రామాలకు చేరుకున్నారు. గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రహదారి, తాగునీరు, ఇళ్లు వంటి వసతులు కల్పించాలని గ్రామస్థులు కోరారు.

వీడని వర్షం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మండలంలో పది రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రహదారులు జలమయమై రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముంచంగిపుట్టులో వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించి కూరగాయలు విక్రయించే మహిళలు, రైతులు అవస్థలకు గురయ్యారు. సోమవారం రూఢకోట గ్రామంలో వారపు సంతకు ఆటంకం ఏర్పడింది. వాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మత్స్యగెడ్డలో నీటి మట్టం పెరుగుతోంది. ముంచంగిపుట్టు నుంచి జామిగుడ వెళ్లే రహదారిలో ఏర్పడిన గుంతలు వర్షపు నీటితో నిండాయి. తుమిడిపుట్టు, కర్లాపొదోర్, మెట్టగుడ, ఉబ్బెంగులు, రామ్‌పుట్టు, వర్కుగుమ్మి గ్రామాల సమీపంలోని గెడ్డలు ఉప్పొంగాయి.

జలమయమైన ముంచంగిపుట్టు రహదారి

ఎమ్మెల్యే, ప్రజా సంఘాల నేతల అడ్డగింత

పాడేరు, న్యూస్‌టుడే: విశాఖపట్నంలోని మారికవలస గురుకులంలోనే గిరిజన విద్యార్థులను కొనసాగించాలని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. మారికవలస బాలికల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు చేపడుతున్న ఆందోళనకు మద్దతుగా వైకాపా ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి హాజరయ్యేందుకు పాడేరు నుంచి సోమవారం బయలుదేరిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు వాహనాన్ని కందమామిడి సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు తమకు లేదా అని ఆయన ప్రశ్నించారు. ప్రజా సంఘాల నేతలు, డీఎల్‌ఓ జాతీయ కమిటీ సభ్యుడు రంజిత్‌కుమార్ తదితరుల వాహనాలను అడ్డుకున్నారు.

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును అడ్డుకున్న పోలీసు

సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్‌లో 18 సీట్ల భర్తీ

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానానికి అనుబంధంగా కొనసాగుతున్న సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 18 సీట్లు భర్తీ అయ్యాయని ప్రిన్సిపల్, ఏడీఆర్ డాక్టర్ డి.ఆదిలక్ష్మి తెలిపారు. సోమవారం పాలిటెక్నిక్ బోధకులు, శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. మొత్తం 25 సీట్లు ఉండగా.. రెండు విడతలుగా నిర్వహించిన కౌన్సెలింగ్, స్పాట్ కౌన్సెలింగ్‌లో 18 సీట్లు భర్తీ అయ్యాయన్నారు. కౌన్సెలింగ్ తేదీ ముగిసిన తరువాత కొందరు ప్రవేశాల కోసం వస్తున్నారన్నారు. మరికొందరు గిరిజన అభ్యర్థులు ఉచిత వసతి కల్పించాలని కోరుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా పోస్టుమెట్రిక్ హాస్టల్ సదుపాయాన్ని విద్యార్థులకు కల్పించాలని కలెక్టర్‌కు లేఖ రాయనున్నట్లు ఏడీఆర్ తెలిపారు. శాస్త్రవేత్తలు డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి, బయ్యపురెడ్డి, వెంకటేష్‌బాబు, సందీప్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న పరిశోధనాస్థానం ఏడీఆర్ ఆదిలక్ష్మి

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తోందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్‌తో కలిసి సోమవారం తాజంగి గ్రామంలో ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు జ్ఞానేశ్వరి, అబ్బాయినాయుడు, ఆనంద్, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాజంగిలో 'ఇంటింటికీ తెదేపా'లో మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి తదితరులు

డుంబ్రిగుడ మండలం కించుమండలో..

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే తెదేపా ధ్యేయమని ఆ పార్టీ ఎస్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కొర్రా బలరాం అన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లిన పార్టీ నేతలు.. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తెదేపా నాయకులు సిరిబాల బుజ్జిబాబు, ముక్కలి మహేష్, గుంట బుజ్జిబాబు, ఈశ్వరరావు, బాలయ్య, వెంకటరమణ, చిన్నబ్బాయి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు అన్నారు. కించుమండలో ఇంటింటికీ తెదేపా కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలను పంచుతూ కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కూటమి ప్రభుత్వంలోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. అరకులోయ నియోజకవర్గ అధికార ప్రతినిధి చినగెన్ను, పంచాయతీ అధ్యక్షుడు నర్సయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: బంగారుమెట్ట పంచాయతీలోని వార్డులు, పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ ధర్మారావు, ఎస్సై నాని, రెవెన్యూ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. స్థానిక ఎన్నికల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని 23 పంచాయతీల్లో 228 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్ఐ రవి తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. ప్రజల పరిశీలనార్థం గ్రామాల్లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

హుకుంపేట, న్యూస్‌టుడే: హుకుంపేటలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పోలింగ్ కేంద్రాల జాబితా అతికించారు. స్థానిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా జాబితాలు అందుబాటులో ఉంచినట్లు సచివాలయ సిబ్బంది పేర్కొన్నారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన తుది జాబితాను సోమవారం ప్రదర్శించారు. మండలంలోని 33 పంచాయతీ కార్యాలయాల్లో తుది జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీవో ప్రసాదరావు తెలిపారు.

హుకుంపేటలో పోలింగ్ కేంద్రాల జాబితా అతికిస్తున్న సిబ్బంది

అక్రమ అరెస్టులు అన్యాయం

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: సమస్యలపై ప్రశ్నించే గిరిజన నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయడం అన్యాయమని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. మారికవలస గిరిజన గురుకులం విద్యార్థులను కలిసేందుకు వెళ్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనర్సను అరెస్టు చేయడాన్ని గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తోందని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పట్టాదారులకు స్థలం కేటాయింపు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: చిలకలగెడ్డలో కొంతకాలంగా వివాదాస్పదంగా ఉన్న స్థలాన్ని ఇంటి నిర్మాణం కోసం పట్టాదారులకు తహసీల్దారు వీరభద్రాచారి కేటాయించారు. సుమారు 20 సెంట్లను నలుగురు లబ్ధిదారులకు అందించారు. సోకేల కొండమ్మ, పాగి బాసు, నెలువడ పద్మశ్రీ, శెట్టి బాలమ్మలకు కేటాయించామని తహసీల్దారు తెలిపారు. ప్రభుత్వ భూమిని గత వైకాపా ప్రభుత్వ హయాంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి స్థానికేతరులకు కేటాయించారని చిలకలగెడ్డ గ్రామస్థులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో పట్టాలు ఇచ్చినవారికి ఇప్పుడు స్థలం కేటాయిస్తున్నారన్నారు.

కొలతలు సేకరిస్తున్న అధికారులు

(c) eenadu